క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష సహాయం



ట్రస్టుబోర్డు సభ్యులకు నగదు అందజేస్తున్న దాత సతీష్

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో చేపడుతున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి అమెరికాలో నివాసం ఉంటున్న పట్టణానికి చెందిన పక్కి వెంకటేశ్వరరావు కుమారుడు సతీష్, అర్చన దంపతులు రూ.1,01,000 సహాయం చేశారు. స్థానిక విజయా కాలనీలోని తన నివాసంలో ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు మంగళవారం నగదు అందజేశారు. ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, గంట్యాడ విష్ణు, ఎస్.వి.జి.శ్రీను, దాసరి రవి పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న గీతా మందిరం నిర్వాహకుడు ప్రకాష్

చీపురుపల్లి: విద్యార్థులకు ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే ఇతిహాసాలపై అవగాహన పెంచుకోవాలని వంగపల్లిపేట ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సౌదామణి చెప్పారు. కృష్ణాష్టమి సందర్భంగా గీతా మందిరంలో ఇటీవల భగవద్గీత శ్లోక పఠన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వంగపల్లిపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థిని ముల్లు చేతన ద్వితీయ, గొర్లె చందు తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి గీతా మందిరం నిర్వాహకులు గీతా ప్రకాష్ మంగళవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వలిరెడ్డి రవీంద్ర నాయుడు, ఎన్.బలరాం, జి.జానకీరాం తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం



నృత్య ప్రదర్శన రూపంలో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

చీపురుపల్లి: గమత్తు పదార్థాలకు బానిసగా మారి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్ఐ కె.కిరణ్ కుమార్‌నాయుడు యువతకు సూచించారు. డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై భగత్ సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ పేరిట చీపురుపల్లి మండల ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని మూడురోడ్ల జంక్షన్‌లో మంగళ వారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ సరదా కోసం ప్రారంభించే మత్తు పదార్థాల వినియోగం జీవితం నాశనమయ్యే పరిస్థితికి తీసుకెళతాయని చెప్పారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నృత్యరూపకంతో అవగాహన కల్పించారు.ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.వెంకీ, జె.రవికుమార్, కమిటీ సభ్యులు రమణ, రూప, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగించుకోవాలి



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కృష్ణాజీ

చీపురుపల్లి: నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.కృష్ణాజీ చెప్పారు.ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ ఆధ్వర్యంలో కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. అమెజాన్, హెటిరో, ఏస్పైరా టెక్నాలజీస్, వే టున్యూస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు చేశారు.176 మంది యువతీ, యువకులు జాబ్‌మేళాకు హాజరు కాగా 74 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అమెజాన్ కంపెనీకి 36 మంది, హెటిరోకు 24, వే టు న్యూస్‌కు ఆరుగురు, ఏస్పైరా కంపెనీకి 8మంది ఎంపికయ్యారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌కుమార్, జేకేసీ కో–ఆర్డినేటర్ ఉషాజ్యోతి, జేకేసీ మెంటార్ అమర్‌లింగం, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ భాస్కర్ పాల్గొన్నారు.

సన్మానం



ఆనందరావును సన్మానిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ డిపోలో కె.ఆనందరావు డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. ఆయన్ని డీఎం కె.రమేష్ నేతృత్వంలో ఆర్టీసీ ఉద్యోగులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా సహచర ఉద్యోగులు, కార్మికులు ఆనందరావు సేవలను కొనియాడారు.

ముస్తాబవుతున్న గణనాథులు

- ఈనెల7న వినాయక చవితి
- నవరాత్రి ఉత్సవాలకు పట్టణాలు, గ్రామాల్లో ఏర్పాట్లు
- విగ్రహాలకు తుది మెరుగులు దిద్దే పనిలో బిజీగా కళాకారులు



కొత్తవలస తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని కేంద్రంలో విక్రయానికి సిద్ధంగా వినాయక విగ్రహాలు

లక్కవరపుకోట: వినాయక చవితి ఉత్సవాలకు సమయం ఆసన్నమైంది. ఈనెల 7న వినాయక చవితిని ఘనంగా నిర్వహించేందుకు పట్టణాలు, గ్రామాల్లో ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. విఘ్నాలకు అధిపతిగా ప్రథమ పూజలు అందుకునే గణనాథుడి విగ్రహాలు ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి. వినాయక చవితికి పది రోజుల ముందు నుంచే పల్లెలు, పట్టణాల్లో పండగ వాతావరణం నెలకొంది. నవరాత్రి ఉత్సవాలకు యువత, పిల్లలు మండపాలను సిద్ధం చేస్తున్నారు. మరో వైపు విగ్రహాల తయారీదారులు విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దేపనిలో నిమగ్నమయ్యారు. గతంలో వినాయక చవితి ఉత్సవాలకు రెండు, మూడు నెలల ముందే రాజస్తాన్, కోల్‌కతా, హైదరాబాద్ ప్రాంతాల నుంచి కళాకారులు ఇక్కడికి వలస వచ్చి కేంద్రాలు ఏర్పాటు చేసుకుని విగ్రహాలు తయారు చేసేవారు. ఎస్.కోట నియోజకవర్గానికి చెందిన పలువురు వారి వద్ద పని చేసి విగ్రహాల తయారీలో మెలకువలు నేర్చుకున్నారు. ప్రస్తుతం ఈప్రాంత కళాకారులే రాజస్తాన్, కోల్‌కతా, హైదరాబాద్ వారి కంటే కళాత్మకంగా విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఎస్.కోట నియోజకవర్గంలో సుమారు వందకుపైగా విగ్రహాల తయారీ కేంద్రాలు ఉన్నాయి. ఎస్.కోట, బొడ్డాం, లక్కవరపుకోట, రంగ రాయపురం, సంతపేట, కొత్తవలస, చింతలపాలెం, దేశపాత్రునిపాలెం, జామి, అలమండ, భీమసింగి తదితర జంక్షన్‌లలో విగ్రహాలను తయారు చేస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడి విగ్రహాలనే కొనుగోలు చేస్తుంటారు. చవితి ఉత్సవాలకు మూడు రోజులే సమయం ఉండడంతో ఇప్పటికే తయారు చేసిన విగ్ర హాలకు తుదిమెరుగులు దిద్దేపనిలో కళాకారులు బిజీ బిజీగా ఉన్నారు. సైజును బట్టి విగ్రహాల ఖరీదు రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకు ఉంటాయని తయారీ దారు లు చెబుతున్నారు.



లక్కవరపుకోట సమీపంలో విగ్రహాల తయారీలో నిమగ్నమైన కళాకారులు

16 ఏళ్లుగా ఇదే వృత్తి



నేను గతంలో నర్సీపట్నం సమీపంలో హైదరాబాద్ నుంచి వచ్చి విగ్రహాలు తయారు చేసే వారి వద్ద పని చేసేవాడిని. 16 ఏళ్లుగా ఇదే వృత్తిలో ఉ న్నాను. ప్రస్తుతం మా గ్రామంలోనే సొంతంగా విగ్రహాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నాను. ఈ ఏడాది వివాయక చవితి ఉత్సవాలకు ఇప్ప టికే వందకుపైగా విగ్రహాలను తయారు చేశాను. వాటికి రంగులు పూసి తుదిమెరుగులు దిద్దుతున్నాం.

– ఎస్.అప్పలరాజు, రంగరాయపురం గ్రామం, ఎల్.కోట మండలం

400 విగ్రహాలను తయారు చేశాం...



కొత్తవలస తహసీల్దార్ కార్యాలయం దగ్గర విగ్రహాల తయారీ కేంద్రం ఏర్పాటు చేశాం. ఈ ఏడాది ఉత్సవాలకు రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టి సుమారు 400 విగ్రహాలను తయారు చేశాం.ఈ ఏడాది వ్యాపారం ఆశాజనకంగా ఉంటుందనుకుంటున్నాం. వివిధ సైజుల్లో, వివిధ రూపాల్లో గణనాథుని విగ్రహాలను తయారు చేశాం.

– జి.గౌరీష్, కుమ్మరిబంజిరి, కొత్తవలస మండలం

యువత రక్తదానం చేయాలి



శిబిరంలో రక్తదానం చేస్తున్న విద్యార్థులను అభినందిస్తున్న ఆర్డీఓ శాంతి

చీపురుపల్లి: రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదానం చేసేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావా లని ఆర్డీఓ బి.శాంతి కోరా రు. స్థానిక ఎస్‌వీఆర్ డిగ్రీ కళాశాలలో వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసై టీ నేతృత్వంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వ హించారు. ఈ శిబిరాన్ని ఆర్డీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో రక్తం లభించక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. అపోహలు వీడి ఆరోగ్యంగా ఉన్న యువకులు ప్రతీ ఆరు నెలలకోసారి రక్తదానం చేయాలన్నారు. శిబిరంలో రక్తదానం చేసిన కళాశాలకు చెందిన 29 మంది విద్యార్థులను ఆమె అభినందించారు. రెడ్‌క్రాస్ సంస్థ డివిజన్ కో–ఆర్డినేటర్ బి.వి. గోవిందరాజులు, వనిత క్లబ్ అధ్యక్షురాలు వి.సంతోషి, కళాశాల కరస్పాండెంట్ ఆదినారాయణ, గవిడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

5న జెడ్పీ చైర్మన్ పుట్టినరోజు వేడుకలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: ఈనెల 5వ తేదీన వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కో–ఆర్డినేటర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పుట్టిన రోజు వేడుకలను నిర్వహించనున్నామని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఇప్పిలి అనంతం తెలిపారు. పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 5న పట్టణ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు కేక్ కటింగ్ చేయనున్నట్లు చెప్పారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, బాపూజీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. పార్టీ నాయకులు మీసాల వరహాల నాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, కోరుకొండ దాలయ్య, కంచుపల్లి అశోక్, పీతల మురళి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఎంపీడీఓ కిశోర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి, గ్రీన్ అంబాసిడర్లు

గజపతినగరం: తమకు వేతన బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని మండలంలోని గ్రీన్ అంబాసిడర్లు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. జీతాలు సకాలంలో అందకపోవడంతో పిల్లల చదువులకు,వైద్యం ఖర్చులకు,తిండికి అప్పులు చేసి జీవనం సాగిస్తున్నామని గ్రీన్ అంబాసిడర్లు వాపోయారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పందించి తమ జీతాలను చెల్లించాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ కిశోర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రీన్ అంబాసిడర్ల సంఘం మండల కార్యదర్శి కె.రాము, అధ్యక్షుడు డి.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గంట్యాడ: గంట్యాడ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీఓ ఉమాభారతి

పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ అధికారులు చెప్పారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గంట్యాడ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పీఓ డోకుల ఉమాభారతి, గరివిడి మండలంలోని శివరాం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో పీఓ ఎన్.ఆరుద్ర, గజపతినగరం మండలంలోని పాతబగ్గాం అంగన్‌వాడీ కేంద్రం–2లో సూపర్‌వైజర్ శకుంతల మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణు లు విధిగా పౌష్టికాహారం తీసుకుంటే పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని అ న్నా రు. బాలింతలు, మహిళలు,కిశోర బాలికల్లో రక్తహీనత సమస్యకు పౌష్టికాహారంతో చెక్‌చెప్పవచ్చని వివరించారు. మునగాకు అనేక వ్యాధులకు దివ్య ఔషధంగా పని చేస్తుందని, దాన్ని ఆహారంలో తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయా కేంద్రాల్లో పౌష్టికాహార పదార్థాలు, కూరగాయలను ప్రదర్శించారు. సూపర్ వైజర్లు సుభాషిణి, పద్మ, శ్రీలక్ష్మి, సుబ్బలక్ష్మి, పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

– గంట్యాడ/ చీపురుపల్లిరూరల్(గరివిడి)/గజపతినగరం రూరల్



చీపురుపల్లిరూరల్(గరివిడి): శివరాంలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీఓ ఆరుద్ర



గజపతినగరం రూరల్: పాతబగ్గాంలో పౌష్టికాహార పదార్థాల ప్రదర్శనను తిలకిస్తున్న గర్భిణులు, బాలింతలు

బాల్య వివాహాలతో అనర్థాలు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీఓ ఉమాదేవి

జామి: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు ఏర్పడతాయని ఐసీడీఎస్ పీఓ ఉమాదేవి, ఎంపీడీఓ సతీష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలతో కలిగే నష్టాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివా హాల నిర్మూలన, వన్‌స్టాప్ సెంటర్, ఉమెన్,చైల్డ్ హెల్ప్‌లైన్, మహిళల చట్టాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎంఈఓ గంగరాజు, వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్ కె.రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు డి.సునీత, కె.విమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలను తగ్గించాలని నిరసన

గజపతినగరం: రోజు రోజుకు పెరిగిపోతున్న నిత్యావసర సరుకుల ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ కోరారు. మండల కేంద్రంలో మంచి నీటి ట్యాంకు వద్ద సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు.ఈసందర్భంగా రమణ మాట్లాడుతూ నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు చుక్కలనంటుతున్నాయని మండిపడ్డారు. అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని, పెంచిన డీజిల్, పెట్రోలు ధరలు తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని కోరారు. 6వ తేదీ వరకు రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతున్నామని చెప్పారు. అనంతరం సంబంధిత వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

తక్కువ మోతాదులో ఎరువులు వాడాలి

దత్తిరాజేరు: వరి పంటకు రసాయన ఎరువులను తక్కువ మోతాదులో వాడాలని గజపతినగరం ఏడీఏ మహరాజన్ సూచించారు. పెదకాద, పోరలి, టి.భూర్జవలస, రామచంద్రాపురం, పాచలవలస గ్రామాల్లో వరి పంటను ఏఓ అనురాధతో కలిసి మంగళవారం పరిశీలించారు. వర్షాలు తక్కువగా ఉన్నందున అధిక మోతాదులో ఎరువులను వినియోగించ కూడదని, వ్యవసాయ సిబ్బంది సలహాల మేరకు తగిన మోతాదులో వాడాలని చెప్పారు. డీఏపీ,యూరియా కొరత ఉన్నందున త్వరలో రైతు సేవా కేంద్రాలకు తెప్పించి రైతులకు పంపిణీ చేసే ప్రయత్నాలు చేస్తున్నామని ఏడీఏ వివరించారు. ఏఈఓ లీలాకృష్ణ, వీఏఏలు పాల్గొన్నారు.

దోమల నివారణపై ప్రత్యేక దృష్టి

- జోనల్ మలేరియా అధికారి శాంతి ప్రభ



శృంగవరపుకోట: కొట్టాం పీహెచ్‌సీలో వైద్య సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న జోనల్ మలేరియా అధికారి శాంతి ప్రభ



గజపతినగరం రూరల్: ఆశ వర్కర్లతో సమావేశమైన మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణ

గంట్యాడ/శృంగవరపుకోట: చాలా వ్యాధులకు కారణమైన దోమల నివారణపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ శాంతి ప్రభ ఆదేశించారు. ఆశ డే సందర్భంగా గంట్యాడ మండలంలోని పెదమజ్జిపాలెం పీహెచ్‌సీలో, ఎస్.కోట మండలంలోని కొట్టాం పీహెచ్‌సీలో ఆశ వర్కర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరి యా, డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి జ్వరాలు ప్రబలడానికి ప్రధాన కారణం దోమలేనని, వాటిని నియంత్రిస్తే వ్యాధులు రాకుండా ఆపగలమన్నారు. దోమల వ్యాప్తిని అడ్డుకోవాలంటే నివాస ప్రాంతాల్లో మురుగునీటి నిలువలు లేకుండా చూడాలని, మొక్కుబడిగా డ్రై డే నిర్వహణతో ఫలితం ఉండదని చెప్పారు. ప్రజలను భాగస్వాముల్ని చేసి, వారికి పరిసరాల పరిశుభ్రత, దోమల వల్ల వచ్చే వ్యాధులు, వాటి పరిణామాలను వివరించాలన్నారు. జిల్లాలో మలేరియా కేసులు పెరుగుతున్నాయని ప్రతీ శుక్రవారం పక్కాగా డ్రైడే పాటించాలన్నారు. డిప్యూటీ మలేరియా అధికారి డి. వి.రమణ, జోనల్ మలేరియా ఈఓ తిరుపతి, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు, పి.ఎం.పాలెం వైద్యాధికారులు పల్లవి, సతీష్, కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారి హారిక తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించండి

గజపతినగరం రూరల్: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్య త ఆశ వర్కర్లదేనని మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణ అన్నారు. పీహెచ్‌సీలో ఆశ వర్కర్లతో మంగళవారం సమావేశం నిర్వ హించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వారానికి రెండు సార్లు ఆశ వర్కర్లంతా తమ పరిధిలో గృహ సందర్శన చేయాలన్నారు. డెంగ్యూ, మలేరియా వ్యాధుల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని,పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలను వివరించాలని సూచించారు. అలాగే గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవం చేయించుకునేలా చైతన్యవంతం చేయాలని చెప్పారు.

15లోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి



పేరిపి గ్రామంలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రామారావు

చీపురుపల్లి: రైతులు తాము సాగుచేస్తున్న ప్రతీ పంటకు సంబంధించి ఈనెల 15లోగా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వి.టి.రామారావు సూచించారు. మండలంలోని పేరిపి గ్రామంలో వ్యవసాయ శాఖ సిబ్బంది మంగళవారం చేపట్టిన ఈ–క్రాప్ నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేసుకుంటేనే ప్రభుత్వం కల్పించే రాయితీలు అందుతాయన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించుకోవడం, ఇన్‌పుట్ రాయితీ వంటి సదుపాయాలు వర్తిస్తాయని చెప్పారు. అనంతరం పట్టణంలోని మన గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని పరిశీలించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏడీఏ ఎన్.కోటేశ్వరరావు, ఏఓ సీహెచ్.రఘునాథ్, వీహెచ్ఏ ఆర్.సోనియా తదితరులు ఉన్నారు.

నిమ్మలపాలెంలో వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ సింహాద్రి నాయుడు, సిబ్బంది

కొత్తవలస: మండలంలోని నిమ్మలపాలెం గ్రామంలో వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి సింహాద్రి నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. 47 మందికి వైద్యపరీక్షలు చేసి ఏడుగురు తీవ్రజ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించి మందులు అందజేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు కారణంగా వైరల్ జ్వరాలు, మలేరియా,డెంగ్యూ, టైఫాయిడ్ జ్వరాలు, జలుబు, దగ్గు వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, చేపలు, మాంసాహారం, నిల్వ ఆహార పదార్థాలు తినకూడదన్నారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. వైద్య సిబ్బంది సత్యారావు, పి.పావని, లక్ష్మి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల ఆందోళన



శృంగవరపుకోట: కొట్టాం పీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేస్తున్న ఆశ వర్కర్లు



కొత్తవలస: వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు



లక్కవరపుకోట: ఎల్.కోటలో పీహెచ్‌సీ డాక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

శృంగవరపుకోట/ కొత్తవలస/లక్కవరపుకోట: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ నేతృత్వంలో ఆశ వర్కర్లు ఎస్.కోట మండలంలోని కొట్టాం పీహెచ్‌సీ, కొత్తవలస మండలంలోని వియ్యంపేట పీహెచ్‌సీ, ఎల్.కోట మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వద్ద మంగళవారం ఆందోళన చేశారు. సీఐటీ యూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, నాయకులు గాడి అప్పారావు,తరిణి వెంకటరమణ మాట్లాడుతూ ఆశ వర్కర్లకు పనితగ్గ వేతనం ఇవ్వకుండా ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుంటోందని మండిపడ్డారు. ఆశ వర్కర్లతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను వెంటనే అమ లు చేయాలని కోరారు. కనీస వేతనం అమ లు చేయాలని, రికార్డులను ప్రభుత్వమే ఇవ్వాలని, సంక్షేమ పథకాల్లో అర్హత కల్పించాలని, అర్హత కల వారికి ఏఎన్ఎంలుగా పదోన్నతి ఇవ్వాలని, 60 ఏళ్లు దాటి న వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి అంశాలపై స్పష్టత ఇవ్వాలని ఆశ వర్కర్లు డిమాండ్ చేశారు. అనంతరం వైద్యాధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

మహిళలకు భద్రత కరువు

శృంగవరపుకోట: దేశవ్యాప్తంగా మహిళలకు భద్రత కరువయ్యిందని, మహిళల భద్రతను ప్రభుత్వాలు గాలికి వదిలేశాయని ఆశ వర్కర్లు భగ్గుమన్నారు. కొట్టాం పీహెచ్‌సీ వద్ద సీఐటీయూ నేతృత్వంలో మంగళవారం నిరసన తెలిపారు. దేశంలో మహిళా రక్షణ చట్టాలు నామమాత్రమే అని, నిర్భయ వంటి ఘటనలు నిత్యకృత్యాలు అయ్యాయని ఆశ కార్యకర్తలు ఆరోపించారు. చిన్నారులు, మహిళలపై అత్యాచారాలు, దాడులకు తెగబడ్డ వారికి అరబ్ దేశాల్లో మాదిరిగా ప్రజా కోర్టుల్లో తక్షణం భయంకరమైన శిక్షలు వేయాలని అన్నారు. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన ఘటన మరువకముందే రాష్ట్రంలో గుడ్లవల్లేరులో ఇంజినీరింగ్ కళాశాలలో బాలికల హాస్టల్‌లో రహస్య కెమెరాల ఘటన వెలుగు చూడడం సిగ్గు చేటన్నారు. ఆశ కార్యకర్తలు బి.విమల, విజయ, సామమ్మ, మంగ, సునీత, రమణమ్మ, శ్రావణి, లక్ష్మి, కృష్ణవేణి, పార్వతి, అనూరాధ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఏఓపై జేడీ ఆగ్రహం

గుర్ల: మండల వ్యవసాయ అధికారి ఎం. తిరుపతిరావుపై జేడీ వి.టి.రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో అందుబాటులో ఉన్న ఎరువుల వివరాల గురించి తెలుసుకునేందుకు మంగళవారం ఆయన స్థానిక వ్యవసాయ కార్యాలయానికి వచ్చారు. 24 సచివాలయాల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో ఉన్న ఎరువుల నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ రైతు సేవా కేంద్రంలో ఎరువులు ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో ఆపరిస్థితి కనిపించకపోవడంతో ఏఓపై జేడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎరువులను పంపిణీ చేసేటప్పుడు వీఏఏల రైతుల బయోమెట్రిక్ తీసుకోవాలని ఆదేశించారు.

పాఠశాల సందర్శన

దత్తిరాజేరు: మండలంలోని చినకాద ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ ఎం.వెంకటరావు మంగళవారం సందర్శించారు. విద్యార్థుల హాజరు, వర్క్‌బుక్‌లు పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో మాట్లాడి మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలని సూచించారు. ఆయన వెంట హెచ్ఎం నాగేశ్వరరావు ఉన్నారు.

విత్తనోత్పత్తిలో జాగ్రత్తలు తప్పనిసరి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ భారతి

జామి: విత్తనోత్పత్తిలో రైతులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వనరులకేంద్రం ఏడీఏ భారతి,కొత్తవలస సబ్‌డివిజన్ ఏడీఏ ఎల్.విజయ సూచించారు. విత్తనోత్పత్తి పథకంలో భాగంగా అప్పన్నపాలెం గ్రామ రైతులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. రైతులు సొంతంగా విత్తనాలు తయారు చేసుకునే విధానాన్నిచ వరిలో చీడీపీడల నివారణ,ఎరువులు, కలుపు యాజమాన్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఏఓ కిరణ్‌కుమార్,ఏఈఓ అహ్మద్,ఎన్.జి.రంగా విశ్వవిద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువలో పూడిక తొలగింపు

గుర్ల: గడిగెడ్డ రిజర్వాయర్ కుడి కాలువ ద్వారా పాలవలస, గూడెం గ్రామాలకు సాగు నీరు అందుతుంది. గడిగెడ్డ నుంచి సాగునీరు విడుదల చేసి నెలరోజులు అవుతున్నా పాలవలసకు నీరు చేరలేదు. కాలువలో చెత్త, పూడిక పేరుకుపోవడం, పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో నీరు ముందుకు పారడం లేదు. దీంతో జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు తన సొంత నిధులతో జేసీబీని ఏర్పాటు చేసి కాలువలో పూడిక, చెత్తను తొలగించే పనులు మంగళవారం చేయించారు.